# ఇన్లాండ్ లెటర్ కథలు

## సంకల్పబలం

వాసుకి బాగా అమ్మాయిల పిచ్చి. వయస్సులో ఉన్నాడు. పైగా అందగాడు. అందుకేనేమో అమ్మాయిలు కూడా వాడితో క్లోజ్‌గా మూవ్ అవుతారు. వాడి అదృష్టమేమో చాలా మంది వాణ్ణి మామయ్యా అనే పిలుస్తారు ఆడైనా, మగైనా. వాడి మాటలు, ఆలోచనలు, రాతలూ అన్నీ ఆడవాసన కూడి ఉన్నవే.

అలాంటి వాసుకి ఉన్న ఊరి నుంచి కొత్త ఊరికి బదిలీ అయ్యింది. ఊరిలో దిగీ దిగగానే ఓ అందాల భరిణె ఎదురైంది. వీలైతే ఓ షట్టు పట్టాలి అనుకున్నాడు మనసులో. మిత్రుడికి తోడుగా వచ్చిన నాతో చెప్పనే చెప్పాడా మాట. 'అదేంట్రా! ఆమె



ఎవరో, ఏమిటో?' అంటున్న నాకు సంకల్పబలం గూర్చి ఉపన్యాసమిచ్చాడు. 'మానవుడే మహనీయుడు' అన్న పాట కూడా పాడి వినిపించాడు. పూర్వకాలం వారు తాము అనుకున్న దానిని సంకల్ప బలం ద్వారానే సాధించే వారని వారికి వారసులమైన మనం కూడా గట్టిగా తలంచుకుంటే ఏదైనా ఐపోతుందన్న వాడి నమ్మకాన్ని బల్ల గుద్ది మరీ చెప్పాడు.

ఎలాగైతేనేం ఆ అమ్మాయికి వారం రోజులు 'సైటు' కొట్టి చివరికి ఉత్తరం కూడా రాసి పంపాడు. ఆరోజు వాళ్ళ బాస్ యింటికి ఆహ్వానిస్తే నన్ను కూడా తీసుకెళ్ళాడు. అక్కడ మాకు కాఫీలందించిన అమ్మాయిని చూసి నాకు పొలమారితే మా వాడికి స్పృహ తప్పినంత పనైంది. , వాడి ఉద్యోగం పోవడం ఖాయం అనుకున్నాం. ఆయన 'ఆ ఉత్తరం' చూపించి నీకంతగా యిష్టమైతే పెళ్ళి చేసుకోమన్నారు. వాడు వెంటనే ఒప్పేసుకోవడంతో పెళ్ళి వెంట వెంటనే జరిగిపోయింది. చివరకు తేలిందేమిటంటే ఆ అమ్మాయి వాళ్ళ బాసింట్లో పనిపిల్లని.

—ఐ.ఎం.రావు, వీరఘట్టం.

## అంతిమ యాత్ర

బందరు, విజయవాడ పట్టణాలలో వడగాడ్పులు ఈరోజు రేపు తీవ్రముగా వీచే అవకాశముంది గావున ఈ పట్టణ ప్రజలు అప్రమత్తముగా వండవలసినదని హెచ్చరించడమయినది" అని ప్రాంతీయ వార్తలలో ప్రకటన వినిపించగానే వీరయ్య గుండె ఆగిపోయినంత పనయ్యింది. చుట్ట ముట్టించే వాడు కాస్త ఆగి చెవులు నిక్కపొడుచుకొని మరీ విన్నాడు. అయ్య బాబోయ్ ఈవాళ గాడ్పు దంచేస్తుంది గావున! యివ్వడు ఎలా! ఈరోజు డ్యూటీ పడకుండ వుంటే బాగుండుననుకున్నాడు. శలవు పెట్టడానికి శలవు లేదు. ఇప్పటికే శలవుపూర్తిగా వాడేసుకున్నాడు. ఇప్పడే శలవు పెడితే జీతం తగ్గిస్తారు. అసలే వచ్చే జీతం కోతలు పోను చాలా తక్కువ వస్తోంది. గ్రీష్మతాపం విజృంభించింది. ఇంతలో వీరయ్యకు పురుషుల వార్డు నుంచి కబురు వచ్చింది. ఒక వయో వృద్ధుడు మరణించాడు. అతని తరఫున నా అను బంధువులు ఎవరూ రాలేదు. అతని చిరునామా తెలియదు. నాలుగు రోజుల క్రితం హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాడు. అనాథ శవాలను స్మశానము నకు తీసుకువెళ్ళి అక్కడ తతంగం పూర్తి చేయించడం వీరయ్య డ్యూటీ. ఈవాళ తన పనైపోయిందనుకున్నాడు గుబులుగా.

అయిష్టంగా పురుషుల వార్డు కెళ్ళాడు. తన కోసం ఒక బెడ్ మీద శవం ముఖంపై గుడ్డ కప్పి వుంది. నర్సు దగ్గరకెళ్ళి దానికి సంబంధించిన కాగితం తీసుకుని డ్యూటీ డాక్టరు చేత సంతకం చేయించుకుని, శవాన్ని బండి పై వేసుకుని, వాచ్‌మెన్‌కు కాగితం చూపించి స్మశానానికి బయలుదేరాడు. వడగాలువు తీవ్రత వల్ల రోడ్డు నిర్మానుష్యంగా వుంది. చెవులకు గుడ్డ బిగించాడు. కనీసం కిలోమీటరు దూరం బండి లాక్కుని వెళ్ళాలి. తనకి ఇంకా 3 ఏళ్ళ సర్వీసుంది. ఈ సర్వీసులో ఇంకా ఎన్ని శవాల్ని లాక్కెళ్ళాలో అనిపించింది. బండి లాగుతుంటే ఎండ తాపం చెంపలను మాడ్చేస్తోంది. డ్యూటీ తప్పదు. మధ్యలో పంపు దగ్గర ఆగి కడుపునిండా నీరు పట్టించి ముఖం కడుక్కొన్నాడు. కొంత ప్రాణం తెరిపిన పడింది.

రకరకాల ఆలోచనలు మనస్సులో సుడులు తిరిగుతున్నాయి. తన ప్రాణం పోతే ఎవరు తీసుకెడతారో అనిపించింది. తనకి సంతానం లేదు. భార్య అనారోగ్యవంతురాలు. ఆమె తరవున బందు



వర్గం చాలా తక్కువ. అయినా తను పోయిన తరువాత ఎవరు తీసుకు పోతే తను చూడ వచ్చాడు అనుకున్నాడు. పోయిన అనాథ శవం ఎవరిదో తెలియదు. ఎక్కడి వాడో తెలియదు. వాడి అయువు తీరి తన పాలపడ్డాడు. తను డ్యూటీ నిక్కచ్చిగా చేసే మనిషి, లొల్లి గిట్టదు. గాలువు పోను పోను ఎక్కువయింది. చెవులోకి గాలి పోయి మెదడు ఆదో రకంగా అయిపోయింది. ఇంక కొద్దిగా కష్ట పడితే స్మశానం చేరుకుంటాడు. అక్కడ ఒక అర గంట పని అయిపోతే ఇంటికెళ్ళి తొంగోవచ్చు. బండి లాగుతున్నాడు. ఆ ప్రాంతం ఇసుక ప్రాంతమేమో మరీ కష్టంగా వుంది లాగడం. చెవ్వ తెగింది. అతి కష్టం మీద బండిని స్మశానానికి చేర్చాడు. అక్కడ శవాలు కాలిన బూడిద గుట్టలు దర్శనమిస్తున్నాయి. కార్యక్రమం పూర్తి చేశాడు. అమ్మయ్య అనుకున్నాడు. ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కొని బండి దగ్గరకు వచ్చాడు. ఇంతలో కళ్ళు బైర్లు కమ్మాయి. చూవు మసకగా వుంది. బాగా నీరసం కమ్మింది. నాలిక తడారి పోయింది. గుండెల్లో ఏదో తెలియని బాధ. బండి దగ్గరకెళ్ళి కుప్ప కూలిపోయాడు. అతని ప్రాణం అనంత వాయువుల్లో కలసిపోయింది. ఎన్నో శవాల్ని మోసుకొని స్మశానానికి చేర్చిన వీరయ్య ఎవరు తీసుకెళ్ళవలసిన అవసరం లేకుండానే యమపురికి ఏగాడు. ప్రాంతీయ వార్తలలో వడగాలువు మృతుల సంఖ్య ఒకటి పెరిగినట్టు రేడియోలో ప్రకటన వెలువడింది.

—డి.వెంకటేశ్వర్లు,
మచిలీపట్నం.